# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 21-09-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షులు జో బైడెన్‌తో ఈరోజు సమావేశం కానున్నారు.
- జమ్మూ సరిహద్దుల్లో చాలా కాలంగా కాల్పుల విరమణ ఉల్లంఘన జరగలేదని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్ షా అన్నారు.
- ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు అతిశి ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు.
- ఛత్తీస్ ఘడ్, ఒడిశా సహా దేశంలోని దక్షిణ ప్రాంతాల్లో రేపు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 114వ సంచిక ఈనెల 29న ప్రసారమవుతుంది.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షులు జో బిడెన్‌తో ఈరోజు రాత్రి డెలావేర్‌లోని విల్మింగ్టన్‌లో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. నరేంద్ర మోదీ 3 రోజుల అమెరికా పర్యటనలో భాగంగా పలువురు నాయకులతో ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. 6వ వార్షిక క్వాడ్ లీడర్స్ సమ్మిట్‌లో ఆయన పాల్గొంటారు. అమెరికా, జపాన్, ఇండియా, ఆస్ట్రేలియాతో కూడిన క్వాడ్ గ్రూప్ సభ్యులు వాతావరణ మార్పులు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల వరకు అనేక సమస్యలను చర్చించనున్నారు. అంతకముందు ఇండో - పసిఫిక్ ప్రాంతంలో శాంతి, పురోగతి, శ్రేయస్సు కోసం పని చేయడానికి క్వాడ్ ఫోరమ్ సమాలోచనలు కలిగిన దేశాల యొక్క కీలక సమూహంగా ఉద్భవించిందని ప్రధాన మంత్రి అమెరికా బయలు దేరే ముందు చేసిన ప్రకటనలో తెలిపారు.

========================

జమ్మూ సరిహద్దుల్లో చాలా కాలంగా కాల్పుల విరమణ ఉల్లంఘన జరగలేదని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా అన్నారు. ఈరోజు ఆయన పూంచ్ జిల్లాలోని మెంధార్ ప్రాంతంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ... సరిహద్దులు నిశ్శబ్దంగా ఉన్నాయని మెంధార్ ఇతర సరిహద్దు జిల్లాల ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని అన్నారు. 1990 నుండి ఈ ప్రాంతం ఉగ్రవాద ముప్పుతో నాశనం చేయబడిందని.. గత ప్రభుత్వ పాలకుల వల్లనే ఈ ప్రాంతం ఎన్నికలకు నోచుకోలేదని అన్నారు. ఇప్పుడు 30 వేలకు పైగా పంచాయతీలు, బ్లాక్‌లు, జిల్లాల ప్రతినిధులు ప్రజాస్వామ్య ఫలాలను అనుభవిస్తున్నారని అమిత్ షా పేర్కొంటూ....

(వాయిస్ 43 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు అతిశి ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఈ రోజు మధ్యాహ్నం రాజ్ నివాస్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమెతో పాటూ.. మంత్రులతో ప్రమాణం చేయించారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు గోపాల్ రాయ్, కైలాష్ గహ్లోత్, సౌరభ్ భరద్వాజ్, ఇమ్రాన్ హుస్సేన్, ముఖేష్ అహ్లావత్ కూడా కేబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అతిశి.. కల్కాజీ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. భారతీయ జనతా పార్టీ నుంచి సుష్మా స్వరాజ్, కాంగ్రెస్ నుంచి షీలా దీక్షిత్ తర్వాత ఢిల్లీకి 3వ మహిళా ముఖ్యమంత్రిగా అతిశి నిలిచారు. కాగా కొద్ది రోజుల క్రితం అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేశారు. దీంతో నూతన ముఖ్యమంత్రిగా అతిశీను ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌ఘడ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టుల హింసాకాండకు గురైన పలువురు బాధితులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సమావేశమయ్యారు. హింసాత్మక మార్గాన్ని ఎంచుకోవడం వల్ల అధిక మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని.. ఇది సమాజానికి మంచిది కాదని ఈ సందర్భంగా సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. మావోయిస్టుల సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తుందని, హింసను విరమించుకోవాలని ద్రౌపది ముర్ము కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్ ఘడ్, ఒడిశా సహా దేశంలోని దక్షిణ ప్రాంతాలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ చేసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, దీని కారణంగా దేశంలోని తూర్పు ద్వీపకల్ప ప్రాంతంలో ప్రధానంగా ఛత్తీస్ ఘడ్, విదర్భ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో రేపు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్డీయే కూటమి ప్రభుత్వం వరుసగా 3వ సారి అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకుంది. ఈ 100 రోజుల పాలనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం మధ్యతరగతి ప్రజలు, రైతులు, మహిళలు, యువతతో పాటూ.. మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి 15 లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించింది. దేశంలోని మధ్యతరగతి ప్రజల సాధికారత కోసం ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిచ్చింది. 7 లక్షల రూపాయల వరకు ఆదాయ పన్ను మినహాయింపుతో పాటూ.. స్టాండర్డ్ డిడక్షన్‌ను 50 వేల నుండి 75 వేల రూపాయలకు పెంచడం వల్ల కోట్లాది మంది పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం కలుగుతోంది. విశ్రాంత రక్షణ సిబ్బంది వారి కుటుంబాల సంక్షేమం కోసం ఏకీకృత పెన్షన్ పథకం కింద 23 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 50 శాతం పెన్షన్ ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ తీర ప్రాంత పరిశుభ్రత దినోత్సవాణ్ని పురస్కరించుకొని ఈ రోజు ముంబైలోని జుహు చౌపట్టిలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర అటవీ పర్యావరణ వాతావరణ మార్పుల శాఖా మంత్రి భూపేందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తీర ప్రాంత పరిశుభ్రతపై అవగాహన కల్పించే రోజు ఈరోజు అని, ఈ కార్యక్రమం 'స్వచ్ఛ్ భారత్, మహాన్ భారత్' దృక్పధాన్ని గణనీయమైన ఉద్యమంగా మారుస్తుందని ఉద్ఘాటించారు. నీటి సంరక్షణలో పని చేస్తున్న స్టార్టప్‌లకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే, తదితరులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 114వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్' కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వన్యప్రాణుల ఆవాసాల సమగ్ర అభివృద్ధిపై అటవీ పర్యావరణం, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నిర్దేశిత 100 - రోజుల లక్ష్యాన్ని సాధించింది. ఇటీవల, కేంద్ర మంత్రివర్గం 2 వేల 6 వందల కోట్ల రూపాయలతో “వన్యప్రాణి నివాస అభివృద్ధి పథకాన్ని” కొనసాగించేందుకు ఆమోదం తెలిపింది. ఈ పథకంలో ప్రాజెక్ట్ ఎలిఫాంట్, వన్యప్రాణుల ఆవాసాల అభివృద్ధితో పాటు కీలకమైన “ప్రాజెక్ట్ టైగర్”లు కూడా ఉన్నాయి. ఈ పథకం ద్వారా ప్రత్యక్షంగా 50 లక్షల మంది జీవనోపాధి పొందుతున్నారని మంత్రిత్వ శాఖ తెలిపింది. మొత్తం 55 టైగర్ రిజర్వ్‌లు, 33 ఏనుగు రిజర్వ్‌లు, 718 రక్షిత ప్రాంతాలు ఈ పథకం నుండి ప్రయోజనం పొందుతున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చెన్నై వేదికగా బంగ్లాదేశ్ తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్ లో భారత్ విజయం దిశగా పయనిస్తోంది. 3వ రోజు 81 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో ఆటను ప్రారంభించిన భారత్ 287 పరుగుల వద్ద డిక్లరేషన్ చేసింది. దీంతో 515 పరుగుల లక్ష్యంతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ 4 వికెట్లు నష్టపోయి 158 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ విజయానికి 357 పరుగులు చేయాల్సి ఉండగా.. మరో 6 వికెట్లు తీస్తే తొలి టెస్టులో భారత్ విజయం సాధిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

హర్యానా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈ నెల 26వ తేదీన “మేరా బూత్... సబ్సే మజ్ బూత్..” కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీజేపీ కార్యకర్తలు, వాలంటీర్లతో సంభాషించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు నమో యాప్ ద్వారా ఆయన వారితో మాట్లాడతారు. ఈ నేపథ్యంలో తమ ప్రశ్నలు, సలహాలను పంపాలని నరేంద్ర మోదీ వారిని కోరారు. కాగా, హర్యానాలో అక్టోబరు 5న ఒకే దశలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రస్తుత వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్‌గా పనిచేస్తున్న ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తదుపరి ఎయిర్ స్టాఫ్ చీఫ్ గా నియమితులయ్యారు. వాయుసేన అధిపతిగా విధులు నిర్వర్తిస్తున్న మార్షల్ వివేక్ రామ్ చౌదరి పదవీ కాలం ముగియడంతో ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం ఆయన నుంచి ఎయిర్ స్టాఫ్ చీఫ్ గా అమర్ ప్రీత్ సింగ్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

=========================

=========================